క్లుప్తంగా

విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం



వేసవి శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు చెస్, క్యారమ్స్, ఇంగ్లిషు గ్రామర్, చదవడం, రాయడం, స్పోకెన్ ఇంగ్లిషు, పాటలు పాడటంపై శిక్షణ ఇచ్చినట్లు గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి తెలిపారు. శిక్షణ తరగతుల్లో 30 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ప్రతి విద్యార్థి వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుంటి గంగా భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగా భవానీ అమ్మవారు

తాళ్లూరు (ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు బాలరాజు, కామేశ్వరశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈఓ కార్తీక్ భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఈ నెల 28వ తేదీ మంగళవారం ఉదయం పది గంటలకు అమ్మవారి ఆలయంలో సామూహిక సుమంగళి పూజా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఈఓ కార్తీక్ తెలిపారు. పూజలో పాల్గొనే భక్తులు సోమవారం ఆలయ సిబ్బందిని సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

గరుడ వాహనంపై దర్శనం ఇచ్చిన వేణుగోపాలుడు



గరుడ వాహనంపై దర్శనం ఇస్తున్న వేణుగోపాల స్వామి

యర్రగొండపాలెం: స్థానిక మిల్లంపల్లి రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి గరుడ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ప్రాముఖ్యత కలిగిన గరుడ సేవ సందర్భంగా దేవాలయంలో నిర్వాహకులు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

రోడ్డు ప్రమాద ఘటనలో మరొకరు మృతి

- మొన్న భార్య, నేడు భర్త
- ఒంటరైన మాతృ హృదయం
- కనిగిరి పాతూరు ఎస్సీ కాలనీలో విషాదఛాయలు

కనిగిరి రూరల్: ఇటీవల వేటపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో తీవ్రంగా గాయపడిన మరొకరు ఆదివారం మృతి చెందారు. ఈనెల 23న గురువారం బాపట్ల నుంచి కారులో తిరిగి కనిగిరికి తిరిగి వస్తుండగా వేటపాలెం వద్ద రెండు కార్లు ఢీ కొన్నాయి. ఈ దుర్ఘటనలో కారులో ఉన్న కనిగిరి పాతూరు ఎస్సీ కాలనీకి చెందిన మన్నెపల్లి గ్లోరి(27) అక్కడికక్కడే చనిపోగా, తీవ్ర గాయాలపాలై నాలుగు రోజులగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భర్త మన్నెపల్లి టెండుల్కర్ (29) ఆదివారం మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని కనిగిరి తీసుకువచ్చి అంత్యక్రియలు చేశారు.

ఒంటరై.. తల్లడిల్లుతున్న మాతృహృదయం

కమలాకర్, ఎలిజిబెత్ దంపతులకు మన్నేపల్లి టెండుల్కర్ ఒక్కడే సంతానం. విశ్రాంత ఉద్యోగి అయిన తండ్రి కమలాకర్ ఏడాది క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. టెండుల్కర్‌కు బాపట్లకు చెందిన గ్లోరితో మూడేళ్ల క్రితమే వివాహమైంది. ఎంతో ఆనందంగా సాగుతున్న కుటుంబాన్ని మృత్యువు కబళించి చిన్నాభిన్నం చేసింది. ఏడాది క్రితం భర్త చనిపోగా, నాలుగు రోజుల వ్యవధిలో కుమారుడు, కోడలు మరణించడంతో... వృద్ధురాలైన తల్లి ఎలిజిబెత్ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టిస్తోంది.



పెదగురవయ్య బజారు (నాడు)



సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసిన తరువాత (నేడు)

మట్టి రోడ్లకు మహర్దశ

- నాడు గుంతల రోడ్లు–నేడు సిమెంటు రోడ్లు
- సంతోషం వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

కొనకనమిట్ల: వర్షం వస్తే ఆ రహదారులు చిత్తడిగా మారేవి. నడవటానికి వీలు లేకుండా ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. ఎన్నో ఏళ్లుగా మట్టి రోడ్లుగా ఉన్న ప్రధాన రహదారులు ఇప్పుడు సిమెంట్ రోడ్లుగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని గొట్లగట్టు ఎస్సీ కాలనీలో మెయిన్ రహదారులు, అనుకు పెదగురవయ్య బజారుతో పాటు నాయుడుపేటలోని పడమటి బజారు కొంత కాలంగా మట్టి రోడ్లుగా ఉన్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా గ్రామ సచివాలయాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుగానే రూ.20 లక్షలు మంజూరు చేశారు. గతంలో ఎమ్మెల్యే కేపీ.నాగార్జునరెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో ఆయా గ్రామాల ప్రజలు సీసీరోడ్లు కావాలని కోరారు. వెంటనే ఆయన ఆయా చోట్ల సచివాలయానికి మంజూరైన రూ.20 లక్షల నిధులతో పాటు అదనంగా ఉపాధి నిధులు మరో రూ.8 లక్షలు మంజూరు చేశారు. వెంటనే ఆయా చోట్ల సిమెంటు రోడ్లుగా అభివృద్ధి చేశారు.

ఎన్నో ఏళ్లుగా గుంతలమయంగా ఉన్న మట్టి రోడ్లు నేడు సిమెంటు రోడ్లుగా మారడంతో ఎస్సీ కాలనీ వాసులతోపాటు పెదగురవయ్య బజారు, నాయుడుపేటలోని పడమటి బజారులోని గృహాల వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అడిగిన వెంటనే మట్టి రోడ్ల అభివృద్ధికి సహకరించిన ఎమ్మెల్యేలు కేపీ.నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తాతిరెడ్డి చినవెంకటరెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, స్థానిక గ్రామ పార్టీ నాయకులకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.



హరిజన కాలనీ (ఎస్సీ కాలనీ)లోని సీసీరోడ్డు



నాయుడుపేటలో పూర్తయిన సీసీరోడ్డు

జయహో లక్ష్మీనారసింహ



కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు



హోమం చేస్తున్న అర్చకులు

- వేడుకగా సప్తాహ మహోత్సవాలు

కొనకనమిట్ల: మండల కేంద్రం కొనకనమిట్ల సమీపంలో వెలసిన రామదూత క్షేత్రంలో ద్వాదశ 12వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. రామదూత క్షేత్ర నిర్వాహకులు, వేదపండితులు అకలంకం వెంకట రామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో ముందుగా హోమాలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీలక్ష్మీనారసింహ స్వామి కల్యాణం భక్తుల జయజయ ధ్వానాలతో, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య మంగళ వాయిద్యాలతో నిర్వహించారు. కల్యాణ ఉభయ దాతలుగా త్రిపురాంతకం మండలం కేశినేనిపల్లి గ్రామానికి చెందిన పలువురు దంపతులు వ్యవహరించారు. ఉత్సవాలను గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు తిలకించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేశారు. సోమవారం శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి వ్రత కార్యక్రమం ఉంటుందని అలాగే జూన్ 1వ తేదీ వరకు శ్రీరామ సప్తాహ మహోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ నిర్వాహకులు యక్కంటి తిరుపతిరెడ్డి, గొలమారి విష్ణువర్థన్‌రెడ్డి, వెలిశెట్టి వెంకటనారాయణ, వేముల వెంకటసుబ్బారెడ్డి తెలిపారు.

అల్లూరి పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



భక్తులకు దర్శనమిస్తున్న అల్లూరి పోలేరమ్మ అమ్మవారు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలను అమ్మవారికి అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉన్న నాగమయ్య శిలలకు, నాగమయ్య పుట్టకు పాలుపోసి ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, చైర్మన్ దాసరి వెంకటేశ్వర్లు, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న హరిహరరావు

మార్కాపురం: హనుమాన్ జయంతి సందర్భంగా జూన్ 1వ తేదీన మార్కాపురం పట్టణంలో జరిగే హనుమాన్ శోభాయాత్రను భక్తులందరూ జయప్రదం చేయాలని కమిటీ ప్రతినిధులు గోపాలుని హరిహరరావు, పీఎల్‌పీ యాదవ్ కోరారు. ఆదివారం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1వ తేదీ సాయంత్రం 4 గంటలకు శోభాయాత్ర తర్లుపాడు రోడ్డులోని ఆంజనేయ స్వామి గుడి వద్ద నుంచి బయలుదేరి ఆర్టీసీ బస్టాండు, కోర్టుసెంటరు, కంభం బస్టాండు, పోలీసుస్టేషన్, దోర్నాల సెంటరు, నాయుడు బజారు, తేరుబజార్ల మీదుగా శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి చేరుతుందన్నారు. అనంతరం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందన్నారు. హిందూ ధార్మిక సంస్థలు, హనుమాన్ భక్తులు, ప్రజలు క్రమశిక్షణతో ర్యాలీలో పాల్గొనాలని సూచించారు. ప్రతి ఒక్క హిందువు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని అన్నారు. ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆధ్యాత్మిక యాత్రలో పాల్గొనే భక్తులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి, కౌన్సిలర్ చాటకొండ చంద్ర, పేరం సత్యనారాయణ, శిరసనగండ్ల శ్రీనివాసులు, పీవీ కృష్ణారావు, ఇమ్మడిశెట్టి వీరారావు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్



తుమ్మలచెరువులో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ మల్లిఖార్జున్, పక్కన ఎస్సై సుధాకర్



స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీసులు

తర్లుపాడు: నేరాల నియంత్రణకే పోలీసు శాఖ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు పొదిలి సీఐ మల్లిఖార్జున్ తెలిపారు. మండలంలోని తుమ్మలచెరువులో ఆదివారం ఉదయం సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వాహన సోదాలు చేశారు. సరైన పత్రాలు లేని 6 వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సై వేముల సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్డన్ సెర్చ్‌లో రెండు బైక్‌లు సీజ్

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పాములపల్లె రోడ్డులో స్థానిక సీఐ వై.వి.సోమయ్య కార్డన్ సెర్చ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కాలనీలోని గృహాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ తన సిబ్బందితో సహా కలిసి కాలనీలోని ప్రతి గృహాన్ని తనిఖీ చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరిస్తూ గృహాల్లో తనిఖీలను ప్రోత్సహించాలన్నారు. తనిఖీల్లో ఎటువంటి పత్రాలు లేని 5 బైక్‌లను గుర్తించి వాటిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎస్సై తోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సండే సయ్యాట



గోలీ గురిచూసి కొట్టాలి



కుంటుల్లాటలో ఔట్ చేస్తూ



బొంగరం తిరగాల్సిందే

కొనకనమిట్ల: వేసవి సెలవుల్లో చిన్నారులు ఆటపాటలతో సందడి చేస్తున్నారు. గ్రామీణ క్రీడలైన కర్రాబిళ్ల, కబడ్డీ, కోతి కొమ్మచ్చి, జంపింగ్, తొక్కుడుబిళ్ల, కుంటుల్లాట, గాలిపటాలు, గోలీలాట, బొంగరాల ఆటలతో పాటు సినిమా హీరోల గ్రీటింగ్‌లతో సందడి చేశారు. ట్రీ పెట్టిలో ఒకరు కూచుంటే కొందరు రైరైమని లాగుతూ ఉత్సాహంగా ఆడే ఆట, చింత చెట్ల దగ్గర చింత చిగురు సేకరిస్తూ, సరదాగా ఊయలలు ఊగుతూ మరింత సందడి చేస్తున్నారు. కొనకనమిట్ల మండలంలోని పలు గ్రామాల్లో చిన్నారుల ఆటపాటలను 'సాక్షి' క్లిక్ మనిపించింది.



బొమ్మలాటలో..



హుషారుగా చెట్టెక్కుతూ

మానవతా సేవా సంస్థకు ఫ్రీజరు వితరణ



సంస్థకు ఫ్రీజరులను అందజేసిన దాతలు

గిద్దలూరు రూరల్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థకు మృతదేహాలను నిల్వ ఉంచే ఫ్రీజరులను ఆదివారం దాతల సహాయంతో నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మానవతా సేవా సంస్థ నిర్వాహకులు గుళ్లా రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవగా భావించి మానవతా సేవా సంస్థ ముందుకు సాగుతోందన్నారు. సంస్థ నిర్వాహకులు సమాజంలోని మంచి హృదయం కలవారి కలయికతో పలు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు. శవాలను నిల్వ ఉంచేందుకు ఫ్రీజర్లను రిటైర్డ్ హెచ్.ఎం.పాండురంగారెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి ఈదుల లక్ష్మీనరసమ్మ అందజేశారని, వారిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు గంజి వీరయ్య, నరసింహులు, వెంకటరామిరెడ్డి, లక్ష్మీరెడ్డి, మోడిగారి రమేష్, విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయులు శోభన్‌బాబు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి ట్రైసైకిల్ అందజేత



ట్రైసైకిల్ అందిస్తున్న గోపాల్‌రెడ్డి తదితరులు

మార్కాపురం: పట్టణంలోని 29వ వార్డు ఆయేషా మసీదు లైనులో నివాసముంటున్న దివ్యాంగురాలు ఆరికట్ల కోటమ్మకు ఆదివారం వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు డీ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా ట్రై సైకిల్ అందించారు. కోటమ్మకు షుగర్‌వ్యాధి కారణంగా కాలు తొలగించడంతో ఆమెకు ట్రైసైకిల్ అందించామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం పట్టణ, రూరల్ అధ్యక్షుడు ఎల్ శేఖర్, ఎస్‌వీ రమణారెడ్డి, రెహమాన్, టీవీ రమణ, సైదా తదితరులు పాల్గొన్నారు.

మారణాయుధాలు ఇళ్లలో దాచడం నేరం



సీజ్ చేసిన వాహనాలతో పోలీస్ సిబ్బంది

దొనకొండ: మారణాయుధాలు ఇళ్లలో దాచడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎల్.సంపత్‌కుమార్ తెలిపారు. మండలంలోని దొండపాడు గ్రామంలో త్రిపురాంతకం ఎస్ఐ వి.సాంబయ్యతో కలిసి ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఓట్ల లెక్కింపు సమయంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సరైన పత్రాలు లేని 9 మోటార్ బైకులను సీజ్ చేశారు. సంబంధిత పత్రాలు చూపిన వారికి వాహనాలు ఇస్తామన్నారు. లేనిచో కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.



దొండపాడులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

జగనన్న సీఎం కావాలని పూజలు



సాగరమాత చర్చి వద్ద తాటిపర్తి యువసేన నాయకులు

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయాలని, యర్రగొండపాలెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ అత్యధిక మెజార్టీతో గెలవాలని కోరుతూ ఆదివారం సాగర్ మేరీ మాత చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక ఇజ్రాయిల్‌పేటకు చెందిన కొర్రపోలు సుందర్‌రావు ఆధ్వర్యంలో తాటిపర్తి తాటిపర్తి యువసేన నాయకులు చింటూ, కొర్రపోలు గుంటు, రాజు, ఇస్సాకు, పరిష పోగు ఎలిశా, బన్ని ద్విచక్రవాహనాలపై నాగార్జున సాగర్‌కు వెళ్లి అక్కడ మేరీ మాత చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు సిద్ధం

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు సిద్ధం అవుతున్నాయి. పాఠశాలలు తెరిచిన రోజే విద్యార్థులకు అందించాలనే ఉద్దేశంతో సంబంధిత విద్యాశాఖాధికారులు ఇండెంట్‌లు అందించారు. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం కానుండటంతో 8వ తేదీ నాటికి సిద్ధం చేస్తున్నామని ఎంఈవో ఇందిరాప్రసాద్ ఆదివారం తెలిపారు.